
Follow:
prabhanjanam

తెలుగు దినపత్రిక
# ప్రభంజనం

సంపుటి: 01 సంచిక: 01
పేజీలు: 7 వెల: 4

08.07.2026 బుధవారం, హైదరాబాద్ WWW.PRABHANJANAM.COM




### అత్యంత సంపన్న రాష్ట్రంగా తెలంగాణ

- ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక
- దేశం తలసరి ఆదాయం రూ.2,63,179.. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.5,15,583
- ఇండోనేషియా, వియత్నాం దేశాల ఆర్థిక దశను దాటేసిందని నివేదిక

2



### స్పోర్ట్స్ ఆడుతుండగా కేటీఆర్ కుమారుడు హిమాన్ష్ కు గాయాలు

- గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స.. మనవడిని చూసేందుకు ఆస్పత్రికి వచ్చిన కేసీఆర్

2



### ప్రధాని నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం

- ఇండోనేషియా అత్యున్నత పురస్కారం
- సత్కరించిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో
- ఈ గౌరవం కోట్లాది మంది భారతీయులకు చెందుతుంది: మోదీ

2



## పెట్టుబడులకు తెలంగాణ విశ్వసనీయమైన గమ్యస్థానం

**గ్రీన్ గ్రోత్ ఎనర్జీ సమ్మిట్ -2026లో డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్ లో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు**

**పరిశ్రమలు స్థాపనకు తెలంగాణ అత్యంత అనుకూలం**

**సమ్మిట్ వేదికగా విదేశీ ప్రతినిధులతో ఆత్మీయ విందు**

**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**

తెలంగాణ రాష్ట్రం పారిశ్రామికంగా, సాంకేతికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ స్థాయి పెట్టుబడులకు అత్యంత అనువైన, సురక్షితమైన గమ్యస్థానంగా తెలంగాణ నిలుస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని హైటెక్స్ నోవాటెల్‌లో నిర్వహించిన గ్రీన్ గ్రోత్ ఎనర్జీ సమ్మిట్-2026 సందర్భంగా వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం వారితో కలిసి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరమని తెలిపారు. పెట్టుబడులు పెట్టే సంస్థలకు అవసరమైన విద్యుత్, నీరు, రహదారులు, అనుసంధాన వ్యవస్థలు వంటి అన్ని మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం సమృద్ధిగా కల్పిస్తోందని చెప్పారు.

• మిగతా 2లో..

# భూ భారతి.. బాహుబలి SCAM



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు భూభారతి వాటాలు వేసుకుని పంచుకుంటున్నారని, ఒకరిని ఒకరు కాపాడుకుంటున్నారని, భూ భారతిలో జరుగుతున్న ప్రతీ అక్రమ కార్యకలాపాల వెనక ఇద్దరి పాత్ర ఉందని ఆరోపించారు బీఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలపై తీవ్ర ఆరోపణలు చేశారు. భూ భారతి వచ్చాక తెలంగాణ రైతులు ఆందోళనలో ఉన్నారని, భూ భారతి పోర్టల్ వచ్చిన తర్వాత రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు.

**- తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**

### రూ.10 వేల కోట్ల స్కామ్‌లో పొంగులేటి సూత్రధారి

- రేవంత్ రెడ్డి, పొంగులేటి ఒకరిని ఒకరు కాపాడుకుంటున్నారు
- భూ భారతి వాటాలు పంచుకుంటున్నారు.. పోర్టల్ దొంగలు మీరే
- ప్రభుత్వం అధికారులను బలి పశువులను చేస్తోంది
- అధికారులతో రికార్డులు తారుమారు చేయిస్తున్నారు
- భారతి పోర్టల్‌లో అక్రమంగా 22 వేల ట్రాన్సక్షన్స్
- భూ భారతి భాదితులు బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుకు రావాలని పిలుపు
- భూ భారతిపై పోలీసు దర్యాప్తు స్టార్ట్ చేయాలి.. ఏసీబీకి ఎవరైనా ఒక్కటే

రెవిన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న భూ భారతి పోర్టల్ లో 22 వేల భూ బదలాయింపులు జరిగాయని, భూమి యజమానులకు సంబంధం లేకుండా భూ భారతి పోర్టల్ లో మార్పులు చేశారని, రైతులు మీ భూమి ఉందో లేదో చెక్ చేసుకోండని సూచించారు. ప్రజల వివరాలను ప్రభుత్వం దాచి పెట్టిందన్న ఆయన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజల హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వంలో కీలకమైన శాఖలు రేవంత్ రెడ్డి, పొంగులేటి వద్ద ఉన్నాయని, రేవంత్ రెడ్డి, పొంగులేటి ఒకరిని ఒకరు కాపాడుకుంటున్నారని అన్నారు. భూ యజమానికి తెలియకుండా భూ బదలాయింపు జరగడానికి రూల్ లేదని గుర్తు చేసిన ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్.. రెవిన్యూ శాఖా చట్టాలను ఉల్లఘించారని, పోర్టల్ లో దొంగలు మీరేనన్నారు. రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో పోర్టల్ మార్పు చేశారని ఎవరి భూములు ఎవరికి బదిలీ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖలో రూ.3 కోట్ల 95 లక్షల కుంభకోణం జరిగిందని మంత్రి పొంగులేటి అన్నారని, 2024 నుంచి 2026 జూన్ వరకు మీ ఎల్లో మాఫియా గ్యాంగ్ లు

• మిగతా 2లో..

## తెలంగాణ బీజేపీలో త్వరలోనే కీలక మార్పులు..!

**బీజేపీలో భారీ మార్పులకు రంగం సిద్ధం.?**

**పలు జిల్లాల అధ్యక్షుల పనితీరుపై కేడర్ అసంతృప్తి**

**అధిష్టానానికి వరుస ఫిర్యాదులు**

**రాష్ట్ర వ్యాప్తంగా 6 నుంచి 10 మంది జిల్లా అధ్యక్షులు మార్పు.?**

**అధ్యక్షుల మార్పుపై పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ**



**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**

అధికార కాంగ్రెస్, బీఆర్ ఎస్ పార్టీలు ఏదో ఒక ఇష్యూపై అనునిత్యం మాటల తూటాలు పేల్చుకుంటున్నాయి. ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఎప్పుడూ మీడియాలో, ప్రజల నోళ్లలో నానేందుకు ప్రయత్నిస్తున్నాయి. నిన్నా మొన్న పార్టీని స్థాపించిన కవిత, తీన్మార్ మల్లన్నలు కూడా ప్రజా సమస్యలపై పోరుబాట పడుతున్నాయి. కానీ రాష్ట్ర బీజేపీ నేతలు మాత్రం ఎదుకో ఏ విషయం కూడా సరిగ్గా స్పందించని పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసినా.. ఏ ఇష్యూపై కూడా తమ స్టాండ్ ను వినిపించడం లేదని ఆ పార్టీ కేడర్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తుంది. ఎప్పుడో ఇప్పుడో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మధ్యలో రెండు వ్యాఖ్యలు చేయడం ఆతర్వాత గమ్మున ఉండడం తప్పా రాష్ట్ర నాయకత్వం మాత్రం ఏ విషయంపై సరైన విధంగా స్పందించడం లేదన్న అసంతృప్తిలో ఉంది.

• మిగతా 2లో..



## సీఎం వద్దకు రివ్యూ పంచాయతీ

- కడియంపై చర్యలు తీసుకోవాలని సీఎంకు మంత్రి కొండా సురేఖ లేఖ

**తెలంగాణ బ్యూరో ప్రభంజనం**

కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుందని ఆపార్టీ నేతలు తరచూ చెబుతూ ఉంటారు. కానీ ఒక మంత్రి వ్యవహారాల్లో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకునేంత ఉంటుందని దేవాదాయశాఖ అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన రివ్యూ మీటింగ్ తో వెలుగులోకి వచ్చింది.

• మిగతా 2లో..

## సీఎంఓ ఉన్నతాధికారులకు శాఖల కేటాయింపు

- పలువురు ఐఏఎస్ లకు అదనపు బాధ్యతలు అప్పగించిన సీఎం
- సీఎం సలహాదారుగా మాజీ ఐఎఎస్ రామకృష్ణ
- న్యాయ, హోం, పరిపాలన కార్యదర్శిగా వి. శేషాద్రి
- శ్రీధర్ గృహనిర్మాణం, పంచాయతీ రాజ్ శాఖలు
- సీఎం ఓఎస్డీగా వేముల శ్రీనివాస్ లు
- మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా మాణిక్ రాజ్

**తెలంగాణ బ్యూరో ( ప్రభంజనం )**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో తన మార్క్ చూపెడుతున్నారు. ప్రతీ శాఖలో ప్రక్షాళనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా సీఎంవో ఉన్నతాధికారులకు సీఎం శాఖలను కొత్తగా కేటాయించారు. కె రామకృష్ణా రావు రిటైర్డ్ ఐఏఎస్ ను ముఖ్యమంత్రి సలహాదారుగా పరిశ్రమలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఇంధన శాఖ, సమాచార, పౌర సంబంధాల శాఖ, సినిమాటోగ్రఫీ క్రీడలు, యువజన సేవలు, సాంస్కృతిక, పర్యాటకం,



• మిగతా 2లో..

## సీఎం వద్దకు రివ్యూ పంచాయతీ

**( మొదటిపేజీ తరువాయి )**

దేవాదాయశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న కొండా సురేఖకు కనీస సమాచారం లేకుండానే, ఆమెకు తెలియకుండానే ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలోని ఆలయాల పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ ఇష్యూపై దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరిపై ఆమె నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. కడియం రివ్యూ మీటింగ్ కు సంబంధించిన ఫోటోలు, ప్రెస్ నోట్, అలాగే ఆయా పత్రికల్లో వచ్చిన కటింగ్ లను ఆమె తన లేఖకు జత చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ప్రభుత్వ పరిపాలన వ్యవస్థ విశ్వసనీయతకు సంబంధించిన అంశం కాబట్టి క్రమశిక్షణ కమిటీతో విచారణ జరిపి కడియం శ్రీహరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రుల రాజ్యాంగబద్ధ అధికారాలను గౌరవించే విధంగా కడియం శ్రీహరికి మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మధ్య గతంలోనూ ఇద్దరి మధ్యలో విభేదాలు ఉన్నాయని, ఈ మధ్యే వివాదాలు సద్దుమణుగుతున్నాయనే సమయంలో మళ్ళీ ఇద్దరి మధ్య రివ్యూ వివాదం నెలకొందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

## పెట్టుబడులకు తెలంగాణ విశ్వసనీయమైన గమ్యస్థానం

**( మొదటిపేజీ తరువాయి )**

పరిశ్రమలు స్థాపించడానికి తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా ఎదిగిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉన్న యువశక్తి, ముఖ్యంగా సాఫ్ట్వేర్, ఐటీ, సాంకేతిక రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులు పెట్టుబడిదారులకు గొప్ప బలమని భట్టి విక్రమార్క అన్నారు. ప్రపంచంలోని ప్రముఖ సంస్థలు తమ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్ల ఏర్పాటుకు హైదరాబాద్‌ను ప్రాధాన్య గమ్యస్థానంగా ఎంచుకోవడం తెలంగాణ సామర్థ్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. తెలంగాణ అతిథి మర్యాదలకు, ఆత్మీయతకు నిలయమని, రాష్ట్రానికి విచ్చేసే ప్రతి పెట్టుబడిదారుని, ప్రతి అతిథిని కుటుంబ సభ్యుల్లా ఆదరించడం తెలంగాణ సంస్కృతిలో భాగమని తెలిపారు. గ్రీన్ గ్రోత్ ఎనర్జీ సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధుల పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సమ్మిట్ నిర్వాహకురాలు రిత్విక భట్టాచార్యతో పాటు వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# డిజిటల్ గవర్నెన్స్

**వ్యవస్థ డిజిటలైజ్ తో పాలన మరింత పారదర్శకం**
**డిజిటల్ గవర్నెన్స్ దిశగా సమగ్ర ప్రణాళికలు**
**అవసరమైన మేరకు చట్టాల రూపకల్పన**
**సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేలా చర్యలు**
**కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తారీఖున జీతాలు**
**రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు**
**ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించని 4300 ఏజెన్సీలు**
**అలాంటి ఏజెన్సీలపై చర్యలకు సీఎం ఆదేశాలు**




**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**

పరిపాలనలో మరింత పారదర్శకత కోసం వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసి అవసరమైన మేరకు చట్టాలను రూపొందించాలని చెప్పారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి మంగళవారం ఎంసీహెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరే విధంగా డిజిటల్ గవర్నెన్స్ అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తారీఖున జీతాలు అందించేలా వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని స్పష్టంగా సూచించారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు.

రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా, ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌తో ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1 నుంచి గరిష్టంగా 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరిగినప్పటికీ సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. దీనిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసేందుకు వీలుగా ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కమిటీ 100 రోజుల్లో నివేదిక సమర్పించి ఈ అంశాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిటలైజ్ చేయాలని, నిరంతరం మానిటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజు, ఎంఏ అండ్ యూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, హెచ్ఆర్డీ వైస్ చైర్మన్ శాంతి కుమారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## మోదీకి అరుదైన గౌరవం

- **ఇండోనేషియా అత్యున్నత పురస్కారం**
- **సత్కరించిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో**

**జకార్తా, ( ప్రభంజనం )**

ఇండోనేషియా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీకి అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేషియా ప్రభుత్వం ఆయన్ను అత్యున్నత పురస్కారంతో సత్కరించింది. బిన్‌టాంగ్ ఆదిపూర్ణ అవార్డుతో మోదీని సన్మానించారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ మెడల్‌ను అందజేశారు. ఎంతో ప్రేమతో ఇండోనేషియాకు తనకు అత్యున్నత పురస్కారాన్ని అందజేసినట్లు పీఎంవో కార్యాలయం తన ట్వీట్‌లో తెలిపింది. ఈ గౌరవం కోట్లాది మంది భారతీయులకు చెందుతుందని మోదీ పేర్కొన్నారు. ఈ సత్కారం ఇండోనేషియా ప్రజల భావోద్వేగాలకు చెందుతుందని తెలిపారు. భారత్, ఇండోనేషియా మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇది నిదర్శనమన్నారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినట్లు మోదీ పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తులను ఇండోనేషియా సర్కారు బింటాంగ్ ఆదిపూర్ణ అవార్డుతో సత్కరిస్తుంది.

# భూ భారతి.. బాహుబలి స్కామ్

**( మొదటిపేజీ తరువాయి )**

ఇదే పని చేస్తున్నాయని ఆరోపించారు. శేరిలింగంపల్లిలో 13 గుంటల భూమిని సహస్ర ఇన్ఫ్రా కంపెనీకి బదలాయించారని, మరోసారి 16 గుంటలను బదలాయించారని, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 200 ఎకరాలకు పైగా భూమిని బదలాయింపు చేశారని అన్నారు. తన శాఖలో ఏం జరుగుతుందో పొంగులేటికి తెలియదా..? అని ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. సీఎం, రెవెన్యూ మంత్రి 50 శాతం వాటాలు పంచుకుంటున్నారని, రాష్ట్రంలో మాఫియా పాలన నడుస్తోందన్నారు. 10 వేల కోట్ల కుంభకోణంపై రెవెన్యూ మంత్రి ఎందుకు ఫిర్యాదు చేయలేదని నిలదీశారు. ప్రభుత్వం అధికారులను బలి పశువులను చేస్తోందని, ఎమ్మార్వోలను ఆర్డీఓలుగా కూర్చోబెడుతున్నారని మండిపడ్డారు. భూ భారతి అక్రమాలపై అధికారుల కమిటీ ఏం రిపోర్ట్ ఇచ్చిందో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. భూ భారతి స్కామ్ రాష్ట్రంలో బాహుబలి స్కామ్ అని, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేయాలని అన్నారు. అధికారులతో రికార్డులు తారుమారు చేయిస్తున్నారని, భూ భారతిపై పోలీసు దర్యాప్తు స్టార్ట్ చేయాలని ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు. రేవంత్ రెడ్డి, పొంగులేటి మాఫియా గ్యాంగ్ ల కాల్ డేటాను బయటకు తీయాలన్నారు. భూ భారతి బాధితులు బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుకు రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన స్కాంలలో ఇదే బాహుబలి స్కాం భూ భారతి సాఫ్ట్ వేర్ మార్చేసి, అక్రమంగా భూములను బదలాయించారని, రెవెన్యూ శాఖ మంత్రిగా మీకు తెలియకుండానే ఇంత పెద్ద స్కాం జరిగిందా..? నిజంగానే నీకు తెలియకపోతే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఏసీబీ కేసులో ఎవరైనా ఒక్కటేనని, కానీ భీం రెడ్డి ఇంటిపై ఏసీబీ దాడులు చేసి అరెస్టు చేయకుండా నోటీసులు ఇచ్చారన్న ఆయన దిలీప్ నాయక్ అనే ఎమ్మార్వోను ఏసీబీ అధికారులు పట్టుకుని వెంటనే అరెస్టు చేశారని, ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించారు. భుజంగరావుకు ఒక న్యాయం, అంబేద్కర్ కు ఒక న్యాయమా అని మండిపడ్డారు. తప్పు చేశారని బీఆర్ ఎస్ నాయకులు క్రిశాంక్, బాల్క సుమన్ ను జైలుకు పంపించారు. మరి రేవంత్ రెడ్డిని, అనిరుధ్ రెడ్డిని, మక్కన్ సింగ్ ను ఎందుకు జైలుకు పంపలేదన్నారు.




## అత్యంత సంపన్న రాష్ట్రంగా తెలంగాణ

- **ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక**
- **దేశం తలసరి ఆదాయం రూ.2,63,179**
- **రాష్ట్ర తలసరి ఆదాయం రూ.5,15,583**
- **ఇండోనేషియా, వియత్నాం దేశాల ఆర్థిక దశను దాటేసిందని నివేదిక**

**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**

దేశంలోనే అత్యంత సంపన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ప్రపంచ బ్యాంకు తాజా నివేదికలో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించింది. భారతదేశం దిగువ మధ్య ఆదాయ విభాగంలో ఉన్నప్పటికీ, తెలంగాణ రాష్ట్రం ఎగువ మధ్య ఆదాయ వర్గంలో ఉందని తన నివేదికలో పేర్కొంది ప్రపంచ బ్యాంకు. దేశం తలసరి ఆదాయం రూ.2,63,179 కాగా తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం రూ.5,15,583 అని వెల్లడించింది. అంతే కాకుండా తెలంగాణ రాష్ట్రం ఇండోనేషియా, వియత్నాం దేశాల ఆర్థిక దశను దాటేసిందని నివేదికలో స్పష్టం చేసింది. ఇదే జాబితాలో ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలు ఉండగా.. డబుల్ ఇంజన్ సర్కార్ గా చెప్పుకునే బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి నేపాల్, ఆఫ్రికా దేశాల కంటే అధ్వానంగా ఉన్నాయని ప్రపంచ బ్యాంకు నివేదికలో పేర్కొంది. దీనిపై బీఆర్ ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ పదేళ్ల పాలన ఎలా సాగింది అనేది ప్రపంచ బ్యాంకు నివేదికనే స్పష్టం చేస్తుందని ఆపార్టీ నాయకులు చెబుతున్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగాలేదు, క్యాన్సర్ రోగిలా మారిందని రాష్ట్రాన్ని తక్కువ చేసి మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి ఇదో చెంపపెట్టు అని బీఆర్ ఎస్ నాయకులు కౌంటర్ ఇస్తున్నారు.

# సీఎంఓ ఉన్నతాధికారులకు శాఖల కేటాయింపు

**( మొదటిపేజీ తరువాయి )**

హైదరాబాద్ మెట్రో రైలు స్పీడ్ లను కేటాయించారు. వి శేషాద్రి సీఎం ముఖ్య కార్యదర్శిగా, సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు, న్యాయ, హోం, ఆర్థిక, ప్రణాళిక శాఖలు, శాసన వ్యవహారాలు, భూ పరిపాలన, ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, వ్యవసాయం, పశుసంవర్ధక, సహకార, మార్కెటింగ్ శాఖలు, ముఖ్యమంత్రి భద్రతలను కేటాయించారు. శ్రీధర్ ను సీఎం ముఖ్య కార్యదర్శి, రవాణా, రోడ్లు, భవనాలు, గృహ నిర్మాణ శాఖ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, విద్య, శక్తి, కార్మిక, ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీల కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. కె మాణిక్ రాజ్ సీఎం కార్యదర్శి, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి, సాగునీటి శాఖ, రెవెన్యూ, గనులు, భూగర్భ, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలు, విపత్తు నిర్వహణ, పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతికత కార్యదర్శిగా, వేముల శ్రీనివాసులు, ముఖ్యమంత్రి ఓఎస్డీగా కొనసాగతడంతో పాటు, మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం, దేవాదాయ, సంక్షేమ శాఖలు, ముఖ్యమంత్రి వినతులు, ప్రజావాణి, సీఎంఆర్ఎఫ్, ముఖ్యమంత్రి కార్యాలయ కంప్యూటరీకరణ, పరిపాలన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. జి. మల్సూర్ ముఖ్యమంత్రి ప్రధాన ప్రజా సంబంధాల అధికారిగా, ముఖ్యమంత్రి అపాయింట్మెంట్లను చూడనున్నారు.



## స్పోర్ట్స్ ఆడుతుండగా కేటీఆర్ కుమారుడు హిమాన్ష్ కు గాయాలు

- **గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స**
- **మనవడిని చూసేందుకు ఆస్పత్రికి వచ్చిన కేసీఆర్**
- **ఆరోగ్య పరిస్థితిపై ఆరా, మెరుగైన వైద్యం అందించాలని సూచన**

**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**

మాజీ సీఎం కేసీఆర్ మనవడు హిమాన్షు రావు స్వల్పంగా గాయపడ్డారు. సోమవారం సాయంత్రం స్పోర్ట్స్ ఆడుతున్న సమయంలో ఆయన ముక్కుకు దెబ్బ తగిలింది. దీంతో హిమాన్షు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కేసీఆర్ హిమాన్షు రావును పరామర్శించడానికి కేసీఆర్ ఎర్రవెల్లి నివాసం నుండి ఏఐజీ ఆసుపత్రికి వచ్చారు. హిమాన్ష్ ను పరామర్శించారు. మనవడితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. డాక్టర్లతో మాట్లాడి తన మనవడు హిమాన్ష్ కు మెరుగైన వైద్యం అందించాలని కేసీఆర్ ఏఐజీ డాక్టర్లకు సూచించారు. అంతకు ముందు కేటీఆర్ తన కుమారుడి ఆరోగ్య పరిస్థితిపై ట్విట్టర్ ( ఎక్స్ ) వేదికగా ఒక ప్రకటన చేశారు. హిమాన్ష్ కు స్వల్ప గాయం అయిందని, అభిమానులు, పార్టీ శ్రేణులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

# తెలంగాణ బీజేపీలో కీలక మార్పులు..!

**( మొదటిపేజీ తరువాయి )**

ఇదే బాటలో జిల్లాల నాయకత్వం నడుస్తుంది.

**అంతా అయోమయం..**

తెలంగాణ బీజేపీలో త్వరలోనే కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశముందనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. చాలామంది నాయకులు సరైన రీతిలో పని చేయడం లేదని, కనీసం ప్రజా సమస్యలపై సైతం స్పందించడం లేదని, ఏం జరిగినా తమకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఆపార్టీ కేడర్ నుండే వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్ (స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూ) పై కూడా రాష్ట్ర బీజేపీ నేతలు అవగాహన కల్పించక పోవడం, అక్కడక్కడ ఏదో సమావేశాలు పెట్టామా అంటే పెట్టాము అన్న రీతిలో మమా అనిపించడం వారి పనితీరుకు అద్దం పడుతుంది. పార్టీ కేడర్‌లో గత కొద్దిరోజులుగా ఎలాంటి ఉత్సాహం లేకుండా పోయింది. ఉన్నామా అంటే ఉన్నాం అనే తప్పా ఏ అంశంపై కూడా సరిగ్గా స్పందించడం లేదనేది స్పష్టంగా కనిపిస్తోంది.




**పలు జిల్లాల అధ్యక్షుల మార్పు..!**

రాష్ట్రంలోని పలువురు జిల్లా అధ్యక్షుల పని తీరుపై అధిష్టానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోందని విశ్వాసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో సంస్థాగత మార్పులపై పార్టీ అధిష్ఠానం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. రాష్ట్రంలోని సుమారు 6 నుంచి 10 మంది జిల్లా అధ్యక్షుల పనితీరుపై రాష్ట్ర, కేంద్ర నాయకత్వానికి పలు ఫిర్యాదులు అందాయని తెలుస్తోంది. పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతం, స్థానిక నాయకత్వ సమన్వయం వంటి అంశాల్లో ఆశించిన స్థాయిలో అధ్యక్షుల పనితీరు లేదని పార్టీ అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. తెలంగాణలో వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని మరింత బలోపేతం చేయాలంటే కొన్ని కీలక మార్పులు తప్పనిసరని కేంద్ర నాయకత్వం రాష్ట్ర నాయకత్వానికి సంకేతాలు ఇచ్చినట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే జిల్లాల స్థాయిలో సంస్థాగత మార్పులు ఉండే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పార్టీలో పరిస్థితులను ఇప్పటికైనా చక్కదిద్దక పోతే రానున్న కాలంలో ఇబ్బందులు తప్పవని ఆపార్టీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# అవయవ దానంతో ఆరుగురికి పునర్జన్మ

## ఏడేళ్ల చిన్నారి 'యశ్వన్' అమరత్వం!

- కేరళలో రోడ్డు ప్రమాదానికి గురైన సిరిసిల్ల జిల్లా బాలుడు
- అంబులెన్స్ రూపంలో వచ్చిన మృత్యువు.. బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారణ
- అమ్మమ్మ సూచనతో అవయవ దానానికి తల్లిదండ్రుల అంగీకారం
- శంషాబాద్‌కు చేరిన మృతదేహం.. స్వగ్రామంలో ముగిసిన అంత్యక్రియలు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో (ప్రభంజనం):**

రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన ఏడేళ్ల చిన్నారి యశ్వన్.. అవయవ దానంతో ఆరుగురికి కొత్త జీవితాన్ని ప్రసాదించాడు. పుట్టెడు దుఃఖంలోనూ ఆ బాలుడి తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలిచింది.సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన లోకినేని రఘు, సౌమ్యల కుమారుడు యశ్వన్. గత నెల 29న కన్యాకుమారి పరిధిలోని టౌన్‌షిప్‌లో యశ్వన్ సైకిల్ తొక్కుతుండగా, ఒక అంబులెన్స్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని కేరళలోని కిమ్స్, ఆపై త్రివేండ్రం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మే 5న బాలుడు బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు.

**18 గంటల్లో ప్రాణదానం:**

ఈ పెను విషాదంలోనూ చిన్నారి అమ్మమ్మ సూచనతో తల్లిదండ్రులు అవయవ దానానికి అంగీకరించారు. వైద్యులు కేవలం 18 గంటల వ్యవధిలో యశ్వన్ గుండె, కాలేయం, కిడ్నీలు, కళ్లను సేకరించి ఆరుగురు రోగులకు విజయవంతంగా అమర్చారు.కార్యక్రమాల అనంతరం యశ్వన్ మృతదేహం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ద్వారా స్వగ్రామమైన లింగన్నపేటకు చేరింది. మంగళవారం స్థానికుల కన్నీటి వీడ్కోలు మధ్య చిన్నారి అంత్యక్రియలు ముగిశాయి.

# శిథిలావస్థ భవనాల్లో విద్యార్థుల చదువులు

- పెచ్చులూడుతున్న పాఠశాల, అంగన్‌వాడి పైకప్పులు
- భయాందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- తరగతి గదిలో మధ్యాహ్న భోజనం వంటలు
- మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- పట్టించుకోని విద్యాశాఖ



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (ప్రభంజనం)**

సర్కార్ బడులు అంటేనే ఆమడ దూరం పెడుతున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు, అక్కడ చదువుల సంగతి ఎలా ఉన్నా.. వసతులు మాత్రం అధ్వాన్నంగా ఉంటున్నాయని, పాఠశాల గదులు శిథిలావస్థకు చేరి ఎప్పుడు ఎక్కడ ఏ భవనం పెచ్చులూడి పోతుందో అన్న భయం అటు విద్యార్థుల్లోనే కాదు ఇటు వారి తల్లిదండ్రులలోనూ కనిపిస్తుంది. ప్రభుత్వం ఓ వైపు కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం నేను సర్కార్ బడుల్లో వసతుల లేమి నెలకొంది. దీంతో ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన పాఠశాలలు నేడు శిథిలావస్థకు చేరుకుని వెలవెలబోతున్నాయి. భవనాల దుస్థితి కారణంగా తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపడానికే వెనుకాడుతున్నారు.

**పెచ్చులూడుతున్న బరిగేలగూడెం ప్రాథమిక పాఠశాల**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని బరిగేలగూడెం ప్రాథమిక పాఠశాల భవనం తీవ్రంగా దెబ్బతింది. పైకప్పు పెచ్చులూడుతూ ఉండటంతో పాటు, వర్షాకాలంలో గోడలు, స్లాబ్‌ల నుంచి నీరు కారుతుంది. కొన్ని చోట్ల సజ్జలు కూడా ఊడిపోతున్నాయి. ప్రస్తుతం ఈ పాఠశాలలో సుమారు 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతీ ఏటా వర్షాకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కాలకృత్యాలు ఆరు బయటే..**

పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకుని ఉపయోగించలేని పరిస్థితిలో ఉన్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా వరకు పిల్లలు ఆరుబయటే కాలకృత్యాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

**తరగతి గదే వంటగది..**

మధ్యాహ్న భోజనం వంటగది కూలిపోవడంతో, తరగతి గదినే వంటగదిగా మార్చి భోజనం సిద్ధం చేస్తున్న పరిస్థితి నెలకొంది. అదే ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడి కేంద్రం భవనం కూడా శిథిలావస్థలో ఉంది. పైకప్పు పెచ్చులూడుతుండటంతో వర్షం పడితే చిన్నారులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం..**

పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ, విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా.. మరమ్మతులు చేపట్టకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల భవనాలకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నేడు అయోధ్య రామమందిర్ దోపిడీపై రౌండ్ టేబుల్ సమా వేశం

**సికింద్రాబాద్, (ప్రభంజనం)**

సమాజ్‌వాదీ పార్టీ తెలంగాణ ఆధ్వర్యంలో అయోధ్య రామమందిర్ దోపిడి అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బాగ్‌లింగం పల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, షోయబ్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్. సింహాద్రి యాదవ్ తెలిపారు. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ గౌడ్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ, ఎంసీపీఐ(యూ) కార్యదర్శి జీ.రవి, టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరుకానున్నారు. అలాగే ఓయూ మాజీ అధ్యాపకులు ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్ రావు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరితో పాటు పలు ప్రజా సంఘాల ప్రతిని ధులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించనున్నారని ఆయన తెలి పారు. ఈ సమావేశంలో అయోధ్య రామమందిర్ నిర్మాణం, నిధుల సేకరణ, సంబంధిత అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు ప్రొఫెసర్ సింహాద్రి తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి మరణం పట్ల కేసీఆర్ సంతాపం

**తెలంగాణ బ్యూరో, ప్రభంజనం**

తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహా రెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర సంతాపం ప్రకటించారు. రాజకీయాల్లో నిరాడంబరత, నీతి నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన ప్రజల మనిషి నర్సింహా రెడ్డి అనీ, వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. భూదానోద్యమంలో తన వందలాది ఎకరాలను పేదలకు పంచిన నర్సింహా రెడ్డి, 1969లో తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో పాల్గొని, మూసీ పరిరక్షణ కోసం, తెలంగాణకు గోదావరి నదీ జలాల కోసం కృషి చేశారని తెలిపారు. శోక తప్తులైన కొమ్మిడి నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

# కాలంతో పాటు విద్యార్థులు మారాలి

- రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి.ముకుంద రెడ్డి
- ఓయూలో ప్రారంభమైన "ఓజస్2K26"

**ఓయూ (ప్రభంజనం)**

కాలంతో పాటు విద్యార్థులు మారాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి . ముకుంద రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల హాలు నెంబర్ 133లో మంగళవారం జరిగిన "ఓజస్ 2K26" ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చదువు, విజ్ఞానం ఎవరి సొంతం కాదని అన్నారు. తమకు ఇష్టమైన దాన్ని నేర్చుకుని విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక టాలెంట్ ఉంటుందని, దాన్ని బయటకు తీసుకువస్తూ ముందుకు సాగాలన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వస్తున్న విద్యార్థులు ఎంతో కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ట్స్ కళాశాలలో చదవాలనే తన జీవిత లక్ష్యం ఎం.ఏ పొలిటికల్ సైన్స్ లో చేరడంతో తీరిందన్నారు. ఓయూ విద్యార్థులకు తమ వంతు సహకారం అందించడానికి తాను సిద్ధమేనన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్ మాట్లాడుతూ.. వ్యక్తిగత క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. నాణ్యత, నైపుణ్యం ప్రతిభతో కూడిన విద్య ద్వారానే విద్యార్థులకు అవకాశాలు అందడంతో పాటు 2047 సంవత్సరం నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారు తుందని అన్నారు. ఆర్ట్స్ లేకపోతే మనిషి జీవితం ఉండదన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటకు రావడానికి "ఓజస్" ఒక వేదిక అని, దీనితో విద్యార్థులకు లర్నింగ్, నెట్ వర్కింగ్, ఫ్రెండ్‌షిప్ సోషల్ సెన్సిటివిటీ, గ్లోబల్ కాంపిటీషన్ మొదలైనవి తెలుస్తాయని వీసీ పేర్కొన్నారు. ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ రంగాలలో జర్మనీ, జపాన్లను చూసి ఎంతో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సరైన కృషి, అంకితభవంతో ముందుకు సాగినప్పుడు రాష్ట్ర, దేశ ప్రగతితో పాటు వ్యక్తి వికాసం ఉంటుందన్నారు. "ఓజస్ 2K26" ప్రారంభ సభకు అధ్యక్షత వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం మాట్లాడుతూ.. ఆర్ట్స్ కళాశాల అంటే ధర్నాలు, ఉద్యమాలే కాదు... అకాడమిక్స్ లో కూడా అగ్రభాగంలోనే ఉంటుందన్నారు. ఆర్ట్స్ కాలేజీ లెగసీనీ మరింత ముందుకు తీసుకోవడానికి తాము కృషి చేస్తున్నామని తెలిపారు. తొలిసారిగా లిటరరీ, కల్చరల్, అకాడమిక్ ఫెస్ట్ ను "ఓజస్2k26" పేరుతో నిర్వహిస్తున్నామని వివరించారు. నగర వ్యాప్తంగా 30 కళాశాలల నుంచి విద్యార్థులు హాజరై వివిధ రకాల పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కరస్పాండెంట్ కె క్రిష్ణారావు మాట్లాడుతూ.. ఓజస్ 2k26" ను ఆర్గనైజ్ చేస్తున్న విద్యార్థులను, పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులను అభినందించారు. ఓయూ పాలకమండలి సభ్యులు బి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. తల్లి తర్వాత తల్లి ఉస్మానియా యూనివర్సిటీ అని పేర్కొన్నారు.

# సమాజ సేవలో టీజీఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులు

- అనాథ పిల్లలు, వృద్ధులు, పేద విద్యార్థులలకు ప్రతి నెల ఆర్థిక సహాయం
- 27 అనాథ, వృద్ధ, పేద పిల్లల సంక్షేమ సంస్థలకు నెలకు 20 వేల చొప్పున ఆర్థిక సహాయం
- ఉద్యోగులను అభినందించిన ఉన్నతాధికారులు



**తెలంగాణ బ్యూరో, (ప్రభంజనం)**

సమాజం పట్ల తమ ఉదారతను చాటుకుంటూ తమ వంతు బాధ్యతను కార్యరూపంలో చూపిస్తూ టీజీఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులు గొప్ప మానవతా కార్యక్రమాన్ని చేపడుతున్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఉద్యోగులు స్వచ్ఛందంగా అందిస్తున్న విరాళాలతో ఏర్పాటు చేసిన టీజీఎన్‌పీడీసీఎల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనాథ పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, పేద విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సేవలందిస్తున్న సేవాసంస్థలకు నిరంతర ఆర్థిక సహాయం అందచేస్తున్నారు. ఎంతో సంతోషంగా ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి తమకు చేతనైనంత సహాయం చేయడం, అదికూడా ప్రతి నెల తమ సాలరీ నుండి ఇవ్వడం వారికి అనాథ పిల్లల పట్ల, వృద్ధుల పట్ల, దివ్యాంగులు, పేద విద్యార్థుల పట్ల ఉన్న దాతృత్వ హృదయాలకు నిదర్శనం. టీజీఎన్‌పీడీసీఎల్‌లోని యూనియన్లు, అసోసియేషన్లు ఉద్యోగుల సానుకూల సహకారంతో ఈ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పడిందని, సంస్థలోని ప్రతి ఉద్యోగి నెలకు కనీసం రూ.50 చొప్పున, అంతకంటే ఎక్కువ మొత్తాన్ని స్వచ్ఛందంగా విరాళం అందిస్తున్నారు. ఈ నిధులను సమాజంలోని అవసరమైన వర్గాలకు చేరేలా పారదర్శక విధానంలో వినియోగిస్తూ, ప్రస్తుతం టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 18 సర్కిళ్లలో సేవలందిస్తున్న 27 సేవా సంస్థలకు ప్రతి నెల రూ.20,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ విధంగా ఉద్యోగుల నుంచి ప్రతి నెల సుమారు రూ.5.40లక్షల మేర నిధులు సమకూరుతున్నాయని, ఈ స్వచ్ఛంద సంస్థలు ప్రధానంగా అనాథ పిల్లల సంరక్షణ, వృద్ధాశ్రమాల నిర్వహణ, దివ్యాంగుల సేవ, పేద పిల్లల విద్యా సహాయం, మహిళా సంక్షేమం, మానసిక వికలాంగుల పునరావాసం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇటు వినియోగదారులకు మెరుగైన , నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు, సామాజిక సేవలలో సంస్థ తమ వంతు భాధ్యతను నిర్వర్తిస్తున్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ ఉద్యోగుల ఈ స్వచ్ఛంద దాతృత్వం సంస్థ సామాజిక బాధ్యతను మరింత పెంచుతుందని, మానవతా విలువలకు అద్దం పట్టేలా ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరి హృదయాలలో సేవ గుణం ప్రతిబింబిస్తుంది. టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని హనుమకొండ, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, వరంగల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ సేవాసంస్థలకు ఈ ఆర్థిక సహాయం అందుతోంది. ఉద్యోగుల సహకారంతో సమకూరుతున్న ఈ సహాయం, అనాథ పిల్లల ముఖాల్లో చిరునవ్వులు నింపడంతో పాటు వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు, పేద పిల్లలకు, దివ్యాంగులకు, అవసరంలో ఉన్న అనేక మందికి కొత్త ఆశను చిగురిస్తుంది. సమాజంలోని బలహీన వర్గాల పట్ల మానవతా దృక్పథంతో ముందుకు సాగుతున్న టీజీఎన్‌పీడీసీఎల్ చారిటబుల్ ట్రస్ట్, భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలను చేపట్టే దిశగా కృషి చేస్తోంది. ఉద్యోగుల సేవా నిరతిని టీజీఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు అభినందించారు.

# గుండ్లపోచంపల్లి వార్డులో సీఎంసీ కమిషనర్ శ్రీజన పర్యటన

- ప్రజా సమస్యలపై సమీక్ష

**కొంపల్లి, (ప్రభంజనం)**

వన్ డే, వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన మంగళవారం జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, వివిధ శాఖల అధికారులతో కలిసి కుత్బుల్లాపూర్ జోన్, మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి వార్డును సందర్శించి స్థానిక నివాసితులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశమై క్షేత్రస్థాయిలో పౌర సమస్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పనులు, దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్ మరమ్మతులు, మూసుకుపోయిన డ్రెయిన్ల శుభ్రపరచడం, కొత్త వీధి దీపాల ఏర్పాటు, పనిచేయని వీధి దీపాల మరమ్మతులు, దోమల నియంత్రణ, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి కుక్కల నియంత్రణ, టౌన్ ప్లానింగ్ అంశాలు, పెండింగ్ మౌలిక సదుపాయాల పనులు వంటి అంశాలను సమీక్షించారు. గుర్తించిన అన్ని సమస్యలను సంబంధిత శాఖలు ప్రాధాన్యతతో చేపట్టి, అవసరమైన చోట ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ శ్రీజన అధికారులను ఆదేశించారు.

# చిన్నారులే దేశ సంపద.. వారి చిరునవ్వే నిజమైన అభివృద్ధికి ప్రతీక

- ఏ చిన్నారి అంగన్వాడి సేవలకు దూరం కాకూడదు: మంత్రి సీతక్క
- మొబైల్ అంగన్వాడి వాహనాన్ని ప్రారంభించిన మంత్రులు సీతక్క, వివేక్




**తెలంగాణ బ్యూరో, (ప్రభంజనం)**

చిన్నారులే దేశ సంపద, దేశ భవిష్యత్తని, తెలంగాణ-2047 లక్ష్య సాధనలో నేటి చిన్నారులే కీలక పాత్ర పోషిస్తారని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అందుకే ఏ ఒక్క చిన్నారికీ అంగన్వాడి సేవలు అందకుండా ఉండకూడదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ అంగన్వాడి కేంద్రాలను ప్రారంభిస్తోందని తెలిపారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలో కార్మిక శాఖ మంత్రి వివేక్‌తో కలిసి కార్మిక శాఖ సహకారంతో మహిళా, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన మొబైల్ అంగన్వాడి వాహనాన్ని మంత్రి సీతక్క జెండా ఊపి ప్రారంభించారు. ఈ మొబైల్ అంగన్వాడి వాహనం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఇందిరమ్మ కాలనీలో అంగన్వాడి సేవలు అందించనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఇప్పటివరకు సాంప్రదాయ అంగన్వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులకే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీస్కూల్ విద్య, తల్లి శిశు సంక్షేమ సేవలు అందుబాటులో ఉండేవని, అయితే అంగన్వాడి కేంద్రాలు లేని ప్రాంతాల్లో నివసించే చిన్నారులు, ముఖ్యంగా పనుల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వలస వచ్చే కార్మికుల పిల్లలు ఈ సేవలకు దూరమవుతున్నారని అన్నారు. అలాంటి ఒక్క చిన్నారి కూడా ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఈ మొబైల్ అంగన్వాడి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఆమె చెప్పారు. అంగన్వాడి కేంద్రాల్లో లభించే అన్ని సేవలు మొబైల్ అంగన్వాడి కేంద్రాల్లో కూడా అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, ఎదుగుదల పర్యవేక్షణ, ప్రీస్కూల్ విద్యతో పాటు తల్లి శిశు సంక్షేమానికి సంబంధించిన అన్ని సేవలను ఈ వాహనాల ద్వారా అందిస్తామని చెప్పారు. వలస కార్మికులు ఎక్కువగా నివసించే ప్రాంతాలకు ఈ మొబైల్ అంగన్వాడి వాహనాలు నేరుగా వెళ్లి సేవలు అందిస్తాయని సీతక్క తెలిపారు.

ఒక్కో మొబైల్ అంగన్వాడి వాహనం దాదాపు పది అంగన్వాడి కేంద్రాలకు సమానంగా సేవలు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉందని, ఒక్కో మొబైల్ అంగన్వాడి కేంద్రం ద్వారా సుమారు 300 మంది లబ్ధిదారులకు సేవలు అందనున్నాయని మంత్రి సీతక్క వెల్లడించారు. ప్రభుత్వం సేవలను ప్రజలు ఉన్న చోటుకే తీసుకెళ్లాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. చిన్నారి చిరునవ్వే నిజమైన అభివృద్ధికి ప్రతీక అని పేర్కొన్న మంత్రి సీతక్క, స్వాతంత్ర్యోద్యమ తొలి దశల్లో గ్రామాలకు వెళ్లి అక్షరాస్యత, విజ్ఞానాన్ని పంచిన చైతన్య రథాల మాదిరిగానే ఈ మొబైల్ అంగన్వాడి కేంద్రాలు కూడా ప్రతి చిన్నారికి పోషకాహారం, ఆరోగ్యం, విద్యను చేరవేసి ఆరోగ్యవంతమైన భావితరాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి, మేడ్చల్ మల్కాజ్గిరి డిడబ్ల్యూఓ శారద, కార్మిక మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## ఈనెల 9 నుంచి రెండో విడత సింగరేణి బాయిబాట

- హెచ్ఎంఎస్ తో కలిసి టీఆర్ఎస్ సింగరేణి బొగ్గు గనులపై పర్యటన
- కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, సత్తుపల్లిలో బాయిబాట
- ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు పర్యటన షెడ్యూల్

**తెలంగాణ బ్యూరో, ప్రభంజనం**

రెండవ విడత సింగరేణి బాయిబాటకు సిద్ధమయ్యారు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత. సింగరేణి గనుల పరిరక్షణ, డిపెండెంట్ ఉద్యోగాల సాధన కోసం మెడికల్ బోర్డు నిర్వహణ సహా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9వ తేదీ నుంచి రెండో విడత సింగరేణి బాయిబాట కార్యక్రమం చేపట్టనున్నారు. హెచ్ఎంఎస్ తో కలిసి టీఆర్ఎస్ శ్రేణులు సింగరేణి బొగ్గు గనులపై పర్యటించనున్నారు. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాలతో పాటు సత్తుపల్లిలో ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు పర్యటించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

## అనారోగ్యంతో ఉన్న జనసేన కార్యకర్తకు ప్రేమకుమార్ పరామర్శ

**కూకట్‌పల్లి, ప్రభంజనం:**

అల్లాపూర్‌కు చెందిన జనసేన పార్టీ కార్యకర్త ప్రసాద్‌ను కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మంగళవారం పరామర్శించారు. గత రెండు రోజులుగా మోతీనగర్‌లోని లీలా హాస్పిటల్‌లో న్యూరో సమస్యతో చికిత్స పొందుతున్న ప్రసాద్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. అనంతరం బాధితుడి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రేమకుమార్‌తో పాటు నియోజకవర్గ నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్ తదితరులు బాధితుడిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

### కాంగ్రెస్ పాలనలో స్టేట్ నుంచి స్ట్రీట్ వరకు

# అవినీతి జరుగుతోంది

### హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని కేసీఆర్ అభివృద్ధి చేశారు

- కాంగ్రెస్ మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చింది
- కాంగ్రెస్ వాళ్ళు హౌలే మాటలు మాట్లాడుతూ చూతే పనులు చేస్తున్నారు
- కుడాలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోంది
- తోడు దొంగలు రాజేందర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి అవినీతికి పాల్పడుతున్నారు
- కుడా స్థలాలను అప్పనంగా పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు
- సుమారు 70 కోట్ల అవినీతి కుడాలో జరిగింది
- అసెంబ్లీ మాజీ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**



రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో స్టేట్ నుంచి స్ట్రీట్ వరకు అవినీతి జరుగుతోందని, మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాళ్ళు హౌలే మాటలు మాట్లాడుతూ.. చూతే పనులు చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు అసెంబ్లీ మాజీ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్. మంగళవారం బీఆర్ స్ భవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడిన వినయ్ భాస్కర్.. రాష్ట్రంలో దోపిడీ పాలన నడుస్తుందని, హెచ్సీయూలో ఏ విధంగా చేశారో వరంగల్ లో అదే విధంగా చేస్తున్నారని, కూడా భూములను పెద్దలకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వరంగల్ నగరంలో దేవుడి భూమి 5 ఎకరాల స్థలాన్ని స్టార్ హోటల్ కు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని, కుడా ఆధ్వర్యంలో కుంటలను కబ్జాలు చేసి బిల్డర్లకు అప్పగిస్తున్నారన్నారు. వెంకట్రామిరెడ్డి భుజంపై తుపాకీ పెట్టి రాజేందర్ రెడ్డి కాలుస్తున్నారని, రాజేందర్ రెడ్డి నాలుగు ఫీట్లు ఉంటారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. మేము తెలంగాణ ఉద్యమంలో ఉంటే రాజేందర్ రెడ్డి గూండాలతో మాపై దాడి చేసే ప్రయత్నం చేశారని అన్నారు. కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి కుడా స్థలాలను వేలం పెట్టి విలువైన భూములను తమ వారికి ఇప్పించుకున్నారని, కుడా టెండర్లను సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రద్దు చేయాలని వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. రెండున్నర ఎకరాల ప్రైమ్ ల్యాండ్ అప్పటి కలెక్టర్ ఆమ్రపాలి కుడాకు అప్పగించారని, ఇప్పుడు ఆ స్థలాన్ని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ 8 ప్లాట్లుగా చేసి వేలం పెట్టారని, గజం రూ.65 వేలకు ఫిక్స్ చేశారన్నారు. ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి సిండికేట్ ఏర్పాటు చేసి అదనంగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. 6,697 గజాలను వేలంలో పెట్టారు. రూ100 కోట్ల ఆదాయం కుడాకు రావాలి, కానీ రూ.49 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చిందని గుర్తు చేశారు. నర్సంపేట రోడ్డులో కమర్షియల్ ప్లాట్ కు గజం రూ.85 వేలు ఫిక్స్ చేశారని, అలా కుడాకు రూ.70 కోట్ల నష్టం చేశారని మండిపడ్డారు. తాను కూడా చైర్మన్ గా ఉన్నప్పుడు ఒక్క గజం తక్కువ రేటుకు అమ్మలేదన్నారు. సీఎం, మంత్రులు,ఎమ్మెల్యేలు తోడేళ్ళలా దోచుకుంటున్నారని వినయ్ భాస్కర్ మండిపడ్డారు. కుడా వేలాన్ని రద్దు చేసి ఆన్ లైన్ టెండర్ల ద్వారా వేలం ప్రక్రియ నిర్వహించాలని, గజం రూ. 70 వేలు ఇవ్వడానికి ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ఎవరని ఆయన ప్రశ్నించారు. కుడా ఏమైనా రాజేందర్ రెడ్డి స్వంత ప్రాపర్టీనా...? కుడాపై రాజేందర్ రెడ్డికి ఏం అధికారం ఉందని ప్రశ్నించారు. ఇష్టం వచ్చినట్లు ఎమ్మెల్యే బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని, రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత వరంగల్ వెస్ట్ లో ఒక్క ఇంచు అభివృద్ధి జరగలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన కుడా అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని వినయ్ భాస్కర్ సవాల్ విసిరారు.

**రాజేందర్ రెడ్డి జాగ్రత్తగా మాట్లాడాలి: కె.వాసుదేవ రెడ్డి**

ప్రభుత్వం కమీషన్ పాలన జిల్లాలకు పాకిందని, రాష్ట్రంలో మున్సిపల్, హోం శాఖ మంత్రి లేరని రాష్ట్రంలో పాలన ఇష్టారాజ్యంగా మారిందని అన్నారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరం అభివృద్ధి చెందిందని ఆఘనత మాజీ సీఎం కేసీఆర్ కే దక్కుతుందన్నారు. బాలసముద్రం ఏరియాలో కుడా భూములను ఆఫ్ లైన్ లో వేలం పెట్టారన్నారు. రేవంత్ రెడ్డి పరివారం రాష్ట్రాన్ని దోచుకుందని ఆరోపించారు. కుడా భూముల వేలాన్ని రద్దు చేయాలని, వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో రైతు విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, ఇతర బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## టీఆర్ఎస్ పార్టీ పేరుపై కవితకు తాత్కాలిక ఊరట

- మరో వారం రోజుల సమయం ఇచ్చిక ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ( ప్రభంజనం )**

టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) పార్టీ పేరు కేటాయింపు వివాదంలో కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. టీఆర్ఎస్ పేరును కేటాయించడం సాధ్యం కాదంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది మే 12, జూన్ 23 తేదీల్లో నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై వారం రోజుల్లో సమాధానం ఇవ్వడానికి కవితకు అవకాశం కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం నోటీసులకు ఇప్పటి వరకు స్పందించని కవిత.. నేరుగా మంగళవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం వారం రోజుల్లో కవిత తన అభిప్రాయాలను తెలిపిన తర్వాత వ్యక్తిగతంగానూ ఆమె వాదనలు విని తుది నిర్ణయం తీసుకోవాలని ఈసీకి హైకోర్టు సూచించింది. విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం తరపు న్యాయవాది కీలక అంశాలను కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే టీఆర్ఎస్ పేరుతో పోలిక ఉన్న రెండు రాజకీయ పార్టీలు నమోదై ఉన్నందున.. అదే పేరును కవితకు కేటాయించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. అంతేకాకుండా టీఆర్ఎస్ పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని, గతంలో ఇలాంటి వ్యవహారాల్లో ఎవరికీ వ్యక్తిగతంగా వాదనలు వినడానికి అవకాశం ఇవ్వలేదని కోర్టుకు వివరించారు. టీఆర్ఎస్ పేరును కేటాయించడం సాధ్యం కాదని ఇప్పటికే కవితకు స్పష్టం చేసినట్లు ఈసీ తరపు న్యాయవాది తెలిపారు. మరోవైపు కవిత తరపు న్యాయవాది మాత్రం టీఆర్ఎస్ పేరును ఆమెకు కేటాయించాలని కోర్టులో వాదనలు వినిపించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసుల నేపథ్యంలో కవితకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండానే ప్రతికూల నిర్ణయం తీసుకోవడం సముచితం కాదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు వారం రోజుల్లో కవిత అభిప్రాయాలను తెలిపిన తర్వాత వ్యక్తిగతంగానూ ఆమె వాదనలు విని తుది నిర్ణయం తీసుకోవాలని ఈసీకి ఢిల్లీ హైకోర్టు సూచించింది.

## 7వ విడత రైతుభరోసా నిధుల విడుదల

- కేవలం 7 రోజుల్లోనే రైతుభరోసా కింద 7750.45 కోట్లు జమ
- 8 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న 58,831మంది లబ్ధిదారులు
- రైతుల ఖాతాలలో 259.73 కోట్లు జమ
- ఇప్పటివరకు మొత్తం 68.96 లక్షల మంది రైతులకు రూ.7750.45 కోట్ల రైతుభరోసా
- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**



రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద మంగళవారం 7 వ విడతలో 7 నుండి 8 ఎకరాలకు వరకు సాగుభూమి కలిగిన రైతుల ఖాతాల్లో రూ. 259.73 కోట్లను నేరుగా జమ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ విడతలో 58,831 మంది రైతులు, 4.32 లక్షల ఎకరాల సాగుభూమికి సంబంధించిన రైతుభరోసా సాయాన్ని పొందారని మంత్రి తెలిపారు.

మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విడతల వారీగా రైతుభరోసా నిధులను విడుదల చేస్తున్నామని, ఇప్పటికే 6 దశలలో 7 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు నిధులు విడుదల చేయగా, తాజాగా 7 నుండి 8 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరికీ రైతుభరోసా సాయం అందించమన్నారు.

ఇప్పటి వరకు రైతుభరోసా పథకం కింద మొత్తం 68.96 లక్షల మంది రైతులకు, 129.17 లక్షల ఎకరాల సాగుభూమికి సంబంధించి రూ.7750.45 కోట్ల సహాయాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి రైతుకు రైతుభరోసా అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.



## పోడు రైతులకు న్యాయం చేయాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్
- పోడు రైతులతో కలసి కలెక్టరేట్ ఎదుటధర్నా

**ఆసిఫాబాద్, ( ప్రభంజనం )**

కెరమెరి మండలం సుర్దాపూర్ గ్రామ శివారులో అటవీ శాఖ అధికారులు భూమిని స్వాధీనం చేసుకుని ట్రెంచ్ ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ బాధిత రైతులతో కలిసి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న భూములను తమకే తిరిగి ఇవ్వాలని పోడు రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. వర్షాకాలం వచ్చిన తర్వాత రైతులు దుక్కి దున్ని విత్తనాలు వేసిన సమయంలో అటవీ అధికారులు వచ్చి సాగు భూముల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకోవడం అన్యాయమని మండిపడ్డారు. 40-50 ఏళ్లుగా సాగులో ఉన్న భూములను ఇప్పుడు అటవీ భూముల పేరుతో లాక్కోవడం సరైంది కాదని, ఈ ఏడాది రైతులకు సాగు అవకాశం ఇవ్వడంతో పాటు వచ్చే ఏడాది రెవెన్యూ-ఫారెస్ట్ జాయింట్ సర్వే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు.



## జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్ 2026-27 ముగింపు

- పాల్గొన్న జిల్లా ఎస్పీ డి.జానకి
- విజేతలకు ప్రశంసా పత్రాల ప్రధానం

**మహబూబ్ నగర్ బ్యూరో, ( ప్రభంజనం )**

మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్ -202627 ముగింపు కార్యక్రమం మంగళవారం జిల్లా ఎస్పీ డి. జానకి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్ లో జోన్-VII పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని సైంటిఫిక్ ఏవిడెన్స్, ఇన్వెస్టిగేషన్, కంప్యూటర్ నాలెడ్జ్, డాగ్ స్కాడ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమంలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ డి. జానకి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోనల్ స్థాయిలో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపికైన అధికారులు, సిబ్బంది అదే పట్టుదలతో రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి జోన్-VIIకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇటువంటి డ్యూటీ మీట్‌లు పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, దర్యాప్తు సామర్థ్యాలను మరింత మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జోన్ గౌరవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని విజేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, భూత్పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణతో పాటు వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### మాటల గారడి చేసి గెలిచిన రేవంత్ రెడ్డి

# రెండేళ్లకే వెల్లకిలా పడ్డాడు

- సైబరాబాద్ మున్సిపాలిటీ మీద ఎగిరేది కాషాయ జెండానే
- బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యవర్గ సమావేశం
- ముఖ్యఅతిథిగా హాజరైన మల్కాజ్గిరి ఎంపీ ఈటల
- గ్రేటర్ ఎన్నికలకు పార్టీ వర్గాలకు దిశా నిర్దేశం

**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**



మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మాటల గారడి చేసి గెలిచిన రేవంత్ రెడ్డి రెండేళ్లకే వెల్లకిలా పడ్డాడని, ఈ పార్టీ మళ్ళీ గెలవదని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులే అంటున్నారని, కాంగ్రెస్ నాయకులు దీపం ఉన్నప్పుడే చక్క పెట్టుకోవాలని చూస్తున్నారని విమర్శించారు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్. మంగళవారం బీజేపీ అర్బన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటల గ్రేటర్ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. సైబరాబాద్ మున్సిపాలిటీ మీద ఎగిరేది కాషాయ జెండానే అని ఆశాభావం వ్యక్తం చేశారు. నేను ఎంపీగా గెలిచిన తరువాత ఎల్బీనగర్ నియోజకవర్గం కార్పొరేటర్లకి కోట్ల రూపాయల నిధులు వచ్చాయని, ఇక్కడ ఉన్న కార్పొరేటర్లు మాలాంటి వారి అవసరం లేకుండానే ప్రజల పనులు చేసిపెట్టగల సత్తా సంతరించుకున్నారని అన్నారు.

అందుకే గెలుపు చాలా ముఖ్యమని, మనందరికీ గౌరవాన్ని గుర్తింపుని ఇచ్చేది పార్టీ జెండా మాత్రమేనని అన్నారు. గెలిచేవారికి అవకాశాలు వెతుక్కొని వస్తాయని, జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాష్ట్రానికి వచ్చి ఎన్నికల్లో గెలిచి తీరాలి అని చెప్పివెళ్లారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించ కుండా బాయ్ బాయ్ చెపితే గెలవలేమని పార్టీ శ్రేణులను హెచ్చరించారు. ప్రజా సంబంధాలే నాయకులకు కొలమానమని, 2014 నుండి నేను మోడీని చూస్తున్నామని, ఆయనకు గర్వం లేదు. నేను చేసిన అని ఏనాడు చెప్పరు. ప్రజలకు సేవకుణ్ణి అని చెప్తారు అని తెలిపారు. మీ అందరూ రాజకీయాల్లో ఆరితేరి ఉన్నారు. అయినా మోడీ చేసే దానిలో పది శాతం చేసినా మనం గెలిచి తీరుతామని పార్టీ శ్రేణులకు ఈటల సూచించారు. డైరెక్ట్ గా ముఖ్యమంత్రి, ప్రధాని అయిన నాయకుడు నరేంద్ర మోదీ అని, ఆయన ఏనాడు ఓడిపోలేదన్నారు. మోడీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించిన తరువాత మొదట అడుగు పెట్టిన గడ్డ హైదరాబాద్ అని, ఆయనకు మనమంటే అమితమైన ప్రేమ అని అన్నారు.

మాటల గారడి చేసి గెలిచిన రేవంత్ రెడ్డి రెండేళ్లకే వెల్లకిలా పడ్డాడని, ఈ పార్టీ మళ్ళీ గెలవదు అని మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులే అంటున్నారని విమర్శించారు. దీపం ఉన్నప్పుడే చక్క పెట్టుకోవాలని చూస్తున్నారని అన్నారు. భారతదేశ ప్రజలకు విశ్వాసం కల్పించి మూడోసారి గెలిచిన మహా నాయకుడు నరేంద్ర మోడీ అని అబ్ కీ బార్ చార్ సౌ పార్ నినాదం మనం కాదు ప్రజలిచ్చారని, నరేంద్ర మోడీ అజాత శత్రువు అన్నారు. ఆయన పేరు చెప్తే దేశం పులకించిపోతుందన్న ఈటల స్థానిక నాయకులు గొప్పగా ఉంటేనే పార్టీ గెలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామ్‌చందర్ రావు, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ జీ, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, జాతీయ నాయకులు పెరాల శేఖర్ జీ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు ప్రభా గౌడ్, రవికుమార్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నుకుల పద్మారెడ్డి, బండారు శైలజ, శ్రీదేవి రెడ్డి, కాలేం రవీందర్, కొత్త రవీందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బండారు భాస్కర్, యశ్‌పాల్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎన్నికల అధికారిని కలిసిన తెలంగాణ బీజేపీ బృందం

- ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై వినతిపత్రం

**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో బీజేపీ ప్రతినిధి బృందం మంగళవారం తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారిని కలిసి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై వినతిపత్రం సమర్పించారు. పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా పాతబస్తీలో, బీఎల్ ఓలు సరైన ఇంటింటి ధృవీకరణ ద్వారా ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం లేదని మా దృష్టికి వచ్చిందని ఈసీ దృష్టికి తీసుకువెళ్లారు. దానికి బదులుగా, ఏఐఎంఐఎం నాయకులు ఏర్పాటు చేసిన క్యాంపులకు వెళ్లి, అక్కడ ఎన్యుమరేషన్ ఫారాలను పెద్ద మొత్తంలో పంపిణీ చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. అలాగే భర్తీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను అప్‌లోడ్ చేయడానికి ఈసీఐ యాప్‌ను ఉపయోగించే యాక్సెస్‌ను ఎంఐఎం నాయకులకు ఇస్తున్నట్లు సమాచారం ఉందని ఇది చాలా తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణించాలని ఈసీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అక్రమాలను వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని, ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం ఇంటింటి ధృవీకరణ చేయాలని, ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ సమగ్రతను కాపాడాలని మేం ముఖ్య ఎన్నికల అధికారిని కోరామని బీజేపీ ప్రతినిధి బృందం తెలిపింది. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ.. ఓటర్లు తమ సొంత రాష్ట్రంలో ఓటు హక్కు నమోదు చేసుకోకపోతే రేషన్ కార్డులు, ఆస్తి హక్కులు, ఇతర ప్రయోజనాలు కోల్పోతారని తప్పుడు భయాలు సృష్టిస్తూ కాంగ్రెస్ పార్టీ వారిని తప్పుదోవ పట్టిస్తోందని, ఇది పూర్తిగా అవాస్తవం, తీవ్రంగా ఖండించాల్సిన విషయం అని అన్నారు. కాంగ్రెస్ ఇంకా ఎంఐఎం నాయకులు బీఎల్ ఓలను బెదిరిస్తున్న తీవ్రమైన విషయాన్ని కూడా మేము ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లామని, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

# తెలంగాణలో స్మార్ట్ పోలీసింగ్

- యూజింగ్ టెక్నాలజీ దిశగా తెలంగాణ పోలీస్
- బేసిక్ పోలిసింగ్ పై దృష్టి పెట్టాలి
- ఖమ్మం సమీక్ష సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్

**ఖమ్మం బ్యూరో, ( ప్రభంజనం )**




తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ యూజింగ్ టెక్నాలజీ' అనే లక్ష్యంతో పోలీస్ అధికారులు ముందుకు సాగాలని రాష్ట్ర డీజీపీ సివి. ఆనంద్ సూచించారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లాలో శాంతిభద్రతలు, నేర నియంత్రణపై ఎస్పీ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. నేరాల నియంత్రణలో పకడ్బందీ చర్యలు, బేసిక్ పోలీసింగ్ పై దృష్టి, కీలక సంస్కరణలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... పోలీస్ యూనిఫామ్ ధరించటం అదృష్టంగా భావించి ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యంగా పోలీస్ సిబ్బంది పని చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కోట్ల మంది జనాభాలో కేవలం 0.16 శాతం మందికే ఈ అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆ గౌరవాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి ప్రజల సేవకు అంకితం కావాలన్నారు. బేసిక్ పోలీసింగ్ పై దృష్టి పెట్టాలని, రాత్రి గస్తీని మరింత బలోపేతం చేసి ఆస్తి నేరాలను అరికట్టాలని డీజీపీ సూచించారు. చట్టం అనేది సామాన్యులకు రక్షణ కవచంలా అండగా ఉండాలని, కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తు చేయాలన్నారు. అదేవిదంగా సివిల్, భూ వివాదాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ను తప్పనిసరిగా పాటించాలని డీజీపీ సీవీ ఆనంద స్పష్టం చేశారు. ఇసుక, మట్టి మాఫియా, రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎస్ 3.0, హాక్ ఐ 3.0, టీజీ కాప్స్ 3.0 వంటి సాంకేతిక వేదికలను సమర్థంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇకపై ఎఫెక్టివ్ పోలీసింగ్, స్మార్ట్ పోలీసింగ్ సమాజ శ్రేయస్సు, ప్రజలకు భరోసా ఇచ్చే దిశగా తెలంగాణ పోలీస్ ముందుకు సాగుతోందని, ఇందుకుగాను ఆధునిక టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), సీసీ కెమెరాలు, డేటా అనలిటిక్స్, సాక్ వ్యవస్థలతో, నేరాల నియంత్రణను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రదానంగా తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టుల కంటే గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఇప్పటికే ఈగల్ పోలీసు బృందాలు గంజాయి సరఫరా, రవాణా మూలలను కట్టడికి క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. మాదకద్రవ్యాలపై యుద్ధం చేయాలి.. భావి తరాలను కాపాడాలి" అని స్పష్టం చేశారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ జిల్లా పోలీసింగ్, నేరాల ధోరణులు, సాంకేతిక ఆధారిత పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్, అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు వసుంధర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, మహేష్, శ్రీనివాసులు, సర్వర్, సత్యనారాయణ, సుశీల్ సింగ్, నర్సయ్య పాల్గొన్నారు.

# పద్మావతి నగర్ లో వాటర్ వర్క్స్ పనులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన

**కూకట్‌పల్లి, ( ప్రభంజనం )**

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మావతి నగర్‌లో రూ.13.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న వాటర్ వర్క్స్ అభివృద్ధి పనులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడేలా ఈ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పద్మావతి నగర్‌లో నీటి సరఫరా సమస్యలు, పైప్‌లైన్‌ల నిర్వహణ, తాగునీటి ఒత్తిడి వంటి అంశాలపై స్థానికులు గత కొంతకాలంగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో రూ.13.50 లక్షల నిధులతో అవసరమైన వాటర్ వర్క్స్ పనులను ప్రారంభించారు. పనులు పూర్తయిన తర్వాత కాలనీలోని అనేక కుటుంబాలకు తాగునీటి సరఫరా సౌకర్యవంతంగా అందుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. అల్లాపూర్ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ వంటి ప్రజలకు నిత్యం అవసరమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- రూ.360 కోట్లతో రెవెన్యూ శాశ్వత భవనాలు
- 10 ఆర్డీవో,107 తహశీల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**



రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలు అందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార అండ్ పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. నూతన భవనాల నిర్మాణాలపై మంగళవారం అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలివిడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు రూ.263 కోట్లతో అలాగే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్లతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి రూ.360 కోట్లతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి అన్నారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. హౌసింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మించబడతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్‌లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు.

# వరంగల్ పారిశుద్ధ్య నిర్వహణకు అంతర్జాతీయ ప్రశంసలు

- నగర మలశుద్ధీకరణ విధానాలను పరిశీలించిన ఎడిబిఐ జపాన్ కన్సల్టెంట్

**వరంగల్ బ్యూరో, ( ప్రభంజనం )**



గ్రేటర్ వరంగల్ నగరంలో అమలు చేస్తున్న మలశుద్ధీకరణ, మలవిసర్జన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ విధానాలను ఆసియా అభివృద్ధి బ్యాంకు సంస్థ (ఏడీబీఐ) జపాన్ కన్సల్టెంట్ డాక్టర్ కజుషి హషిమోటో మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రశంసించారు. ముందుగా ప్రతినిధుల బృందం అమ్మవారిపేటలో ఏర్పాటు చేసిన రోజుకు 15 కిలోలీటర్లు, 150 కిలోలీటర్ల సామర్థ్యం గల మలశుద్ధీకరణ కేంద్రాలను సందర్శించి, అక్కడ అమలవుతున్న శుద్ధీకరణ ప్రక్రియ, నిర్వహణ విధానాలను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్ లో మలవిసర్జన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థపై ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయ్, బల్దియా కమిషనర్ టి. వెంకన్నతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ.. నగరంలో మలవిసర్జన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సుస్థిర పారిశుద్ధ్య విధానాలను ప్రోత్సహించే క్రమంలో జీడబ్ల్యూఎంసీ, ఆస్కీ సంస్థల సహకారంతో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. దేశంలోనే తొలిసారిగా అమ్మవారిపేటలో రోజుకు 15 కిలోలీటర్ల సామర్థ్యంతో మలశుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, పైరోలసిస్ విధానం ద్వారా మలాన్ని సేంద్రీయ ఎరువుగా మార్చి వ్యవసాయ భూముల్లో వినియోగిస్తున్నామని తెలిపారు. శుద్ధి చేసిన నీటిని రహదారి మధ్య విభజన ప్రాంతాల్లోని మొక్కలకు వినియోగిస్తున్నామని వివరించారు. నగర అవసరాలకు అనుగుణంగా ఇటీవల రోజుకు 150 కిలోలీటర్ల సామర్థ్యం గల ఆధునిక మలశుద్ధీకరణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రేటర్ వరంగల్‌లో అమలవుతున్న పారిశుద్ధ్య నిర్వహణ విధానాలు, మలశుద్ధీకరణ సాంకేతికత, వనరుల పునర్వినియోగ విధానం ఆదర్శప్రాయంగా ఉన్నాయని డాక్టర్ కజుషి హషిమోటో ప్రశంసించారు. ఈ తరహా సుస్థిర పారిశుద్ధ్య నమూనాలు ఇతర పట్టణాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈలు మహేందర్, స్పందన, ఆస్కీ ప్రతినిధులు డాక్టర్ స్నేహలత, రాజ్ మోహన్ రెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (సర్ )లో పాల్గొన్న తలసాని

**జూబ్లీహిల్స్, ( ప్రభంజనం )**

ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (సర్ )లో భాగంగా తన ఇంటికి వచ్చిన అధికారులకు వివరాలు అందజేశారు సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్. మంగళవారం జూబ్లీ హిల్స్‌లోని తన నివాసానికి వచ్చిన బీఎల్ఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్ శివకుమార్‌లకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తమ వివరాల పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి తలసాని స్వర్ణ, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ తలసాని సాయి కిరణ్ యాదవ్ దంపతులు కూడా సర్ అధికారులకు తమ ఓటరు వివరాలను సమర్పించారు.

# ప్రభుత్వ పాఠశాలల మూసివేత తగదు

- ప్రైవేటు పాఠశాలలను నియంత్రించాలి
- ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి
- ముఖ్యమంత్రికి విద్యావేత్తలు, మేధావులు, పౌర సమాజం బహిరంగ బహిరంగ లేఖ

**ముషీరాబాద్, ( ప్రభంజనం )**




రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల బెంగళూరులో ద హిందూ హడల్ కాంక్లేవులో ప్రకటించడాన్ని తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ విద్యావేత్తలు, మేధావులు, ప్రముఖ కవులు, ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణమే ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వంద మందికి పైగా వివిధ రంగాలకు చెందిన మేధావులు ముఖ్యమంత్రికి బహిరంగ లేఖను రాశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ లో పత్రికా విలేఖరుల సమావేశాన్ని నిర్వహించి బహిరంగ లేఖను విడుదల చేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతంలో విస్తరించి ఉన్న 23 వేల బడుల మూసివేతను ఉపసంహరించుకోవాలని, విశృంఖలంగా పెరిగిపోతున్న విద్యా ప్రైవేటీకరణ కార్పొరేటీకరణను నియంత్రించాలని, అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రవేశపెట్టాలని, అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, సరిపడా టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రముఖ పాత్రికేయుడు, సంపాదకులు కే.రామచంద్ర మూర్తి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయని రాష్ట్రంలో విద్యార్థులు లేరని 23 వేల పాఠశాలల మూసివేసే ఆలోచన తగదని, బడులను కుదిస్తే ప్రజలు విద్యకు దూరం చేసినట్లు అవుతుందని తెలిపారు. నాక్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగం సంక్షోభంలో ఉందని అలాగే రాజకీయాలలో విద్య లేదని కానీ విద్యలో రాజకీయాలు ఎక్కువైపోయాయని ఆ కారణంగానే సామాజిక అవసరాలు గుర్తించకుండా పాఠశాలల మూసివేత ప్రకటన చేశారని దుయ్యబట్టారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదనే నెపంతో పాఠశాలల మూసివేత నిర్ణయాలు సరికాదని వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణాలేంటో శాస్త్రీయంగా అధ్యయనం చేశారా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో డాక్టర్ వనమాల, ఫిలిం ప్రొడ్యూసర్ సయ్యద్ రఫీక్, శంకర్ డిబిఎఫ్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్, డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం రాఘవాచారి, విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షులు వై.అశోక్ కుమార్, రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శి ఎం. రఘు శంకర్ రెడ్డి, పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు పి. మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి వంటి మాదకద్రవ్యాల కట్టడికి పటిష్టమైన నిఘా

- టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు చేపట్టాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, జులై 7(ప్రభంజనం) :**



గంజాయి వంటి మాదకద్రవ్యాల కట్టడికి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తూ మత్తు పదార్థాలను నిర్మూలించుటకు తెలంగాణ ఎక్సైజ్ మరియు ప్రొహిబిషన్ శాఖ పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో ఎక్సైజ్ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మత్తు పదార్థాలు పూర్తిగా నిర్మూలించాలన్నారు. మత్తు పదార్థాల నియంత్రణపై పాఠశాలలు ,కళాశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలు, 5 బార్లు కు 20242025 వ సంవత్సరానికి 574.08 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చిందని, 2025 వ సంవత్సరానికి 410. 44 కోట్ల రూపాయలు ఆదాయం సమకూరిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మత్తు పదార్థాలపై కఠినంగా వ్యవహరిస్తామని, పాఠశాలలో, కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు నాగేశ్వరరావు, నరేందర్, సలాం ముస్తఫా, మాన్ సింగ్, రాజేష్, రామచందర్, ఖాజా ఆహమ్మద్, అరుణ, విజయ్ సిద్ధార్థ, హరీష్ లు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్మెంట్

# బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

- మాజీమంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**

హైదరాబాద్ లోని గన్‌పార్క్ వద్ద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ, బీసీ జేఏసీ నాయకులు గుజ్జ కృష్ణ, సురేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నర్సింహ నాయక్, విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, నూతన విద్యార్థులకు కూడా పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు కీలక పదవి..!

**న్యూఢిల్లీ, ( ప్రభంజనం )**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 20 నుంచి జరగనున్న నేపథ్యంలో, అంతకుముందే కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని మోదీ సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్, ప్రధానమంత్రికి కీలక సలహాదారుగా ఉన్న శక్తికాంత దాస్‌కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్థానంలో ఆయనకు ఆర్థిక మంత్రిత్వ శాఖ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది.

## అమ్మవారిని దర్శించుకున్న మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్, ( ప్రభంజనం )**

మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని దండు గ్రామ గ్రామదేవత మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మంత్రి వాకిటి శ్రీహరిని శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్యూబా రిపబ్లిక్ రాయబారిని కలిసిన ఎంపీ జి. వంశీ కృష్ణ

**న్యూఢిల్లీ, ( ప్రభంజనం )**

పెద్దపల్లి ఎంపీ సభ్యులు వంశీ కృష్ణ గడ్డం మంగళవారం న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసంలో క్యూబా రిపబ్లిక్ రాయబారి జువాన్ కార్లోస్ మార్సాన్ అగైలెరాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్యూబాలోని ప్రస్తుత పరిస్థితులు, అలాగే భారతదేశం-క్యూబా దేశాల మధ్య కొనసాగుతున్న ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలను మరింత విస్తరించడం, ప్రజల మధ్య పరస్పర సంబంధాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బంది భద్రతపై ప్రత్యేక దృష్టి

- **ఈనెల 9న సిబ్బందితో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ ముఖాముఖి**

**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**

విద్యుత్ ఉద్యోగుల భద్రత, సంక్షేమం, ప్రమాద రహిత విద్యుత్ సేవల లక్ష్యంతో తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆధ్వర్యంలో ఈనెల 9న బుధవారం హైదరాబాద్‌లోని సెంట్రల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీటీఐ), యూసుఫ్‌గూడలో ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. సంస్థ పరిధిలోని 21 సర్కిళ్ల నుంచి లైన్‌మ్యాన్‌లు, అసిస్టెంట్ లైన్‌మ్యాన్‌లు, జూనియర్ లైన్‌మ్యాన్‌లు ఒక్కోసర్కిల్ నుండి ఇద్దరు చొప్పున మొత్తం 40 మంది ఈ ముఖాముఖిలో పాల్గొంటారు.

# ఈ20 పెట్రోల్‌ను బలవంతంగా అమలు చేస్తున్నారు

- **ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణ**

**న్యూఢిల్లీ, ( ప్రభంజనం**



దేశవ్యాప్తంగా లక్షలాది వాహన యజమానుల అభ్యంతరాలు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఈ20 పెట్రోల్‌ను బలవంతంగా అమలు చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. న్యూఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడిన కేజ్రీవాల్.. జులై 3న ఆరు ప్రధాన ఆటోమొబైల్ కంపెనీలపై ఒత్తిడి తెచ్చి ఈ20 సురక్షితమని చెప్పేలా ప్రెస్‌మీట్ నిర్వహించారని, అందులో మూడు కంపెనీలు అలాంటి ప్రకటన చేయడానికి నిరాకరించాయని పేర్కొన్నారు.

**మారుతీ సుజీకి, టొయోటో కిర్లో**
స్కర్, హీరో మోటోకార్ప్ మాత్రమే ఈ20 పాత వాహనాలకు కూడా సురక్షితమని, మైలేజ్ 5-7శాతం మాత్రమే తగ్గుతుందని చెప్పాయని తెలిపారు. అయితే టొయోటో అధికారిక ఓనర్స్ మ్యాన్వల్ లో ఈ10 (10శాతం ఎథనాల్) వరకు మాత్రమే ఉపయోగించాలని, ఈ10తో కూడా మైలేజ్ లేదా పనితీరులో సమస్యలు వస్తే ఈ0 (0శాతంఎథనాల్) పెట్రోల్‌కు మారాలని సూచించారని పేర్కొన్నారు. కంపెనీల అధికారిక పత్రాల్లో ఈ10 పరిమితి ఉంటే, ఈ20 పూర్తిగా సురక్షితమని ఎలా చెబుతున్నారని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఇదంత కేంద్ర ప్రభుత్వం కావాలని చేస్తుందని, ఎవరి లాభం కోసం ఇదంతా చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని కేజ్రీవాల్ అన్నారు.

# సిట్ తుది నివేదిక తర్వాతే పూర్తి సమాధానమిస్తా

- **విచారణ కొనసాగుతున్నందున ప్రస్తుతం మాట్లాడటం లేను**
- **ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి పదవికి ఇప్పటికే ఆమోదం**
- **శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్**

**అయోధ్య, ( ప్రభంజనం )**



అయోధ్య రామమందిరం విరాళాల చోరీ ఆరోపణలపై శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ స్పందించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన తుది నివేదికను సమర్పించిన అనంతరమే ఈ ఆరోపణలపై పూర్తిస్థాయిలో సమాధానమిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం రామభక్తులను ఉద్దేశించి ఆయన ఒక లేఖ విడుదల చేశారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో మౌనంగా ఉండటమే శ్రేయస్కరమని భావిస్తున్నట్లు తెలిపారు. తన ప్రజా జీవితం ఒక తెరిచిన పుస్తకమని చంపత్ రాయ్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ట్రస్ట్ కోశాధికారి స్వామి గోవింద్ దేవ్ గిరి స్పందిస్తూ, చంపత్ రాయ్‌ను ఆయన నమ్మిన వ్యక్తులే మోసం చేశారని, ఇందులో ట్రస్టీల ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం సిట్ దర్యాప్తు పురోగతిలో ఉందని తెలిపారు. వాస్తవాలను వెలికితీసి, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇప్పటికే హామీ ఇచ్చారు. జూన్ ప్రారంభంలో ఆలయ హుండీ నగదు లెక్కింపులో భారీగా అవకతవకలు జరిగినట్లు వార్తలు వెలువడటంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. సీసీటీవీ నిఘా లోపం, సిబ్బందిపై సరైన తనిఖీలు లేకపోవడం, కొందరు ఉద్యోగులు నగదును దారిమళ్లించడం వంటి అంశాలను సిట్ తన ప్రాథమిక నివేదికలో గుర్తించినట్లు సమాచారం. ట్రస్ట్ సభ్యుడి ఫిర్యాదు మేరకు జూన్ 25న ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నగదు లెక్కింపు సిబ్బందితో పాటు చంపత్ రాయ్ మాజీ డ్రైవర్ సహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివాదం తీవ్రం కావడంతో జూలై 6న సమావేశమైన ట్రస్ట్, చంపత్ రాయ్, మరో ట్రస్టీ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలను ఆమోదించింది.

## ప్రజలే నా భద్రత... గన్‌మెన్‌లు వద్దు

- **ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌లను మరోసారి వెనక్కి పంపిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**
- **ప్రజల ప్రేమాభిమానాలే నాకు శ్రీరామరక్ష – ఎమ్మెల్యే వ్యాఖ్య**

**ఉప్పల్, ( ప్రభంజనం )**

ప్రజలే తనకు అసలైన బలం, ప్రజల విశ్వాసమే తనకు అతిపెద్ద భద్రత అనే సందేశాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరోసారి తన ఆచరణ ద్వారా చాటిచెప్పారు. ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌లను మరోసారి వెనక్కి పంపిస్తూ, ప్రజల ప్రేమాభిమానాలే తనకు శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారడమే కాకుండా, ప్రజల్లో కూడా విస్తృత స్పందనకు దారితీసింది. ప్రజాప్రతినిధిగా ప్రజల మధ్యే ఉండటం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం తన ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు దూరంగా ఉండే భద్రతా వలయాల కంటే ప్రజలతో మమేకమై వారి మధ్యే సాధారణ వ్యక్తిలా తిరుగుతూ సేవ చేయడానికే తాను ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ప్రజల నమ్మకం ఉన్న చోట ఎలాంటి భయం ఉండదని, ప్రజల ఆశీస్సులే తనకు రక్షణ కవచమని ఆయన అభిప్రాయపడ్డారు.

## జలమండలి ఉన్నతాధికారులతో ఎండీ అశోక్ రెడ్డి సమీక్ష

- **భవిష్యత్ నీటి అవసరాలకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలి**
- **జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**

**తెలంగాణ బ్యూరో, ( ప్రభంజనం )**




భవిష్యత్ నీటి అవసరాలకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని, భవిష్యత్ నీటి అవసరాలకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం జలమండలి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూర్ విస్తరణకు అనుగుణంగా తాగునీటి పంపిణీ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వచ్చే వేసవికి ముందే నీటి సమస్యలపై ప్రత్యేక కాంటింజెన్సీ ప్లాన్ సిద్ధం చేయాలని, 15 రోజుల్లో కాంటింజెన్సీ ప్రణాళికలు, టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. అక్టోబర్ నాటికి అవసరమైన నీటి మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలని ఎండీ అధికారులకు సూచించారు. సింగూర్‌లో 50 రోజుల నీటి నిల్వ మాత్రమే ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేయాలని అవసరమైతే ప్రత్యామ్నాయ రోజు, దశలవారీ నీటి సరఫరాపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. కృష్ణా, గోదావరి, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాలను సమర్థంగా వినియోగించాలని, అదనపు పంపింగ్, ఫిల్ట్రేషన్ ఏర్పాటుకు నిధుల కొరత అడ్డంకి కాదని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. గోదావరి, మంజీరా వ్యవస్థల్లో సాంకేతిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని, మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పెద్ద ట్యాంకర్ల కోసం ప్రత్యేక ఫిల్లింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, ట్యాంకర్ల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే షోకాజ్ నోటీసులు, శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్యాంకర్ బుకింగ్, డెలివరీ, ట్రిప్పులపై ప్రతిరోజూ సమీక్ష చేయాలని ఆదేశించారు. శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని, ట్రీటెడ్ వాటర్ వినియోగాన్ని కనీసం 2 శాతం పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. తాగునీటి వృథాను అరికట్టి సమాన పంపిణీపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. కలుషిత నీటి సరఫరాపై రాజీ పడేది లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎండీ సూచించారు. నీటి నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.




## ఇజ్రాయెల్‌ను నాశనం చేయండి..!

- **స్పెయిన్‌లో హోరెత్తిన నినాదాలు**
- **స్పెయిన్‌లోని శాన్ ఫెర్మిన్ ఉత్సవాల్లో పాలస్తీనాకు మద్దతు**
- **శాన్ ఫెర్మిన్ బుల్ రన్ ప్రారంభోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు**

**స్పెయిన్, ( ప్రభంజనం )**

స్పెయిన్‌లోని శాన్ ఫెర్మిన్ ఉత్సవాల్లో పాలస్తీనాకు మద్దతుగా ప్రజల నినాదాలు మిన్నంటాయి. శాన్ ఫెర్మిన్ బుల్ రన్ ప్రారంభోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు ఇజ్రాయెల్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్పెయిన్ పాంప్లోనాలో జరిగే ప్రపంచ ప్రసిద్ధ శాన్ ఫెర్మిన్ బుల్ రన్ ప్రారంభోత్సవానికి వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. ఇసుక వేస్తే రాలనంత జనంతో గ్యాలరీలు నిండిపోగా, అక్కడ ఒక భారీ బ్యానర్ అందరి దృష్టిని ఆకర్షించింది. "డెస్ట్రాయ్ ఇజ్రాయెల్" (ఇజ్రాయెల్‌ను నాశనం చేయండి) అని రాసి ఉన్న ఓ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ, ఆందోళనకారులు పాలస్తీనాకు మద్దతుగా నినాదాలు చేశారు. అంతేకాకుండా, పాలస్తీనా సంఘీభావానికి చిహ్నంగా పుచ్చకాయ థీమ్‌తో ఉన్న ఇన్ఫ్లేటబుల్ బెలూన్‌స్‌ను నిరసనకారులు గాలిలోకి వదిలారు. ఇజ్రాయెల్‌పాలస్తీనా సంఘర్షణ నేపథ్యంలో స్పెయిన్‌లోని ఒక ప్రముఖ వేదికపై ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.

## SPORTS news

## సంజూ శాంసన్ విషయంలో అదే తప్పు చేస్తున్నారు

- **శాంసన్ వంటి అనుభవజ్ఞుడిని పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదని**
- **మాజీ క్రికెటర్ కైఫ్**

**స్పోర్ట్స్ డెస్క్, ( ప్రభంజనం )**



టీ20 ప్రపంచ కప్ తర్వాత భారత జట్టు వరుస వైఫల్యాలతో సతమతమవుతుంది. ఐర్లాండ్‌తో సిరీస్ ఓటమి, ఇంగ్లండ్‌తో తొలి మ్యాచ్ రద్దు కాగా, రెండో టీ20లోనూ టీమిండియా 4 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఈ క్రమంలో ఐర్లాండ్ పర్యటన నుంచి పేలవ ప్రదర్శన కనబరుస్తున్న స్టార్ ఓపెనర్ సంజు శాంసన్‌ను రెండో టీ20తో పాటు త్వరలో జరగబోయే జింబాబ్వే పర్యటన నుంచి కూడా తప్పించడం అభిమానుల్లో తీవ్ర చర్చకు దారితీసింది. శాంసన్ స్థానంలో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి జట్టులో అవకాశం కల్పించారు. సంజు శాంసన్ తొలగింపుపై టీమిండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ స్పందిస్తూ సెలెక్టర్ల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. గత టీ20 ప్రపంచ కప్‌లో చేసిన తప్పునే మేనేజ్‌మెంట్ మళ్లీ పునరావృతం చేస్తోందని విమర్శించాడు. టాపార్డర్‌లో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఇద్దరూ ఎడమచేతి వాటం బ్యాటర్లే కావడం వల్ల ప్రత్యర్థులు ఆఫ్ స్పిన్నర్లను దించి వికెట్లు తీసే ప్రమాదం ఉందన్నాడు. దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా టాపార్డర్‌లో తప్పనిసరిగా రైట్, లెఫ్ట్ హ్యాండ్ కాంబినేషన్ ఉండాలని, శాంసన్ వంటి అనుభవజ్ఞుడిని పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదని కైఫ్ అభిప్రాయపడ్డాడు.

## ఆఫ్ఘన్ క్రికెటర్ షాపూర్ జద్రాన్ మృతి

- **అరుదైన వ్యాధితో బాధపడుతూ ఢిల్లీ ఆసుపత్రిలో కన్నుమూత**
- **సంతాపం ప్రకటించిన ఆఫ్ఘన్ క్రికెట్ బోర్డు**
- **ఆఫ్ఘన్ క్రికెట్ చరిత్రలో అతడి సేవలు మరువలేనివన్న ఏసీబీ**

**స్పోర్ట్స్ డెస్క్, ( ప్రభంజనం )**




ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దేశ మాజీ ఫాస్ట్ బౌలర్ షాపూర్ జద్రాన్ (38) కన్నుమూశాడు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జద్రాన్, ఢిల్లీలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచాడు. బుధవారం తన 39వ పుట్టిన రోజు జరుపుకోవాల్సి ఉండగా, ఒక్కరోజు ముందే అతడు ఈ లోకాన్ని వీడటం ఆఫ్ఘన్ క్రికెట్ సమాజాన్ని శోకసంద్రంలో ముంచింది. ఈ విషయాన్ని ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) అధికారికంగా ధ్రువీకరించింది. షాపూర్ జద్రాన్, స్టేజ్ ఫోర్ హెమోఫాగోసిటిక్ లింఫోహిస్టియోసైటోసిస్ (హెచ్ఎల్‌హెచ్) అనే అరుదైన, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి శరీరంలో తీవ్రమైన ఇన్ఫ్లమేషన్‌కు కారణమవుతుంది, దీనివల్ల ఎముకల మజ్జ, కాలేయం, ప్లీహం వంటి కీలక అవయవాలు దెబ్బతింటాయి. గతేడాది అక్టోబర్‌లో అతని ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన చికిత్స కోసం భారత్‌కు వెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో ఆఫ్ఘన్ స్టార్ క్రికెటర్ రషీద్ ఖాన్, ఏసీబీ చైర్మన్ మీర్వైస్ అష్రఫ్ ప్రత్యేక చొరవ తీసుకుని అతని వీసా ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ ఏడాది జనవరి 18న జద్రాన్ న్యూఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో చేరాడు. అప్పటి నుంచి అతనికి చికిత్స కొనసాగుతోంది. మే నెల నుంచి ఐసీయూలోనే ఉన్నాడు. షాపూర్ జద్రాన్ మృతిపై ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఆఫ్ఘన్ క్రికెట్‌కు షాపూర్ గౌరవం, ధైర్యంతో గర్వించేలా సేవలందించాడు. అతను అందించిన సేవలు, సాధించిన విజయాలు ఆఫ్ఘన్ క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతాయని పేర్కొంది. జద్రాన్ 2009 నుంచి 2020 మధ్య ఆఫ్ఘనిస్థాన్ తరఫున 44 వన్డేలు, 36 టీ20 మ్యాచ్‌లు ఆడాడు.



# 'రామాయణ' ట్రైలర్‌కు డేట్ ఫిక్స్..

బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ది ప్రెస్టీజియస్ మైథలాజికల్ చిత్రం 'రామాయణ' యావత్ దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నమిత్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీత పాత్రలో సాయి పల్లవి నటిస్తున్నారు. దీంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి.అయితే, ఈ సినిమాను దీపావళి 2026 కానుకగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ చిత్రానికి సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను జూలై 18న రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సినిమాకాన్ ఫెస్టివల్‌లో ఈ ట్రైలర్‌ను ప్రదర్శించారు. దీంతో ఇప్పుడు ఈ ట్రైలర్‌ను అధికారికంగా రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోందట.కాగా, ఈ సినిమాలో రావణుడి పాత్రలో యష్, లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటిస్తుండగా నమిత్ మల్హోత్రా ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్ర రెండవ భాగాన్ని 2027 దీపావళి కానుకగా రిలీజ్ చేయాలని మేకర్స్ రెడీ అవుతున్నారు.



# రూ.100 కోట్ల చేరువలో 'మా ఇంటి బంగారం'..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నటించిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రదర్శన కొనసాగిస్తోంది. మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల ఆదరణ పొందుతూ వసూళ్ల పరంగా దూసుకుపోతోంది. మూడు వారాలు పూర్తవుతున్నా సినిమా జోరు ఏమాత్రం తగ్గకపోవడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, 18 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.96.5 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిన ఈ సినిమా ఇప్పుడు ప్రతిష్ఠాత్మకమైన రూ.100 కోట్ల క్లబ్కు చేరువైంది. మరో కొన్ని రోజుల్లో ఈ మైలురాయిని అందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.సాధారణంగా పెద్ద సినిమాలు రెండో వారం తర్వాత కలెక్షన్లలో తగ్గుదల నమోదు చేస్తుంటాయి. కానీ 'మా ఇంటి బంగారం' మాత్రం మూడో వారంలోనూ మంచి వసూళ్లతో కొనసాగుతోంది. తాజాగా విడుదలైన కొన్ని కొత్త చిత్రాలకు కూడా ఈ సినిమా గట్టి పోటీ ఇస్తోందని సినీ వర్గాలు చెబుతున్నాయి.కుటుంబ ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ, బలమైన మౌత్ పబ్లిసిటీ కారణంగా సినిమా ఇంకా అనేక ప్రాంతాల్లో మంచి వసూళ్లు నమోదు చేస్తోందని సమాచారం. 'మా ఇంటి బంగారం' రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటితే తెలుగు సినీ చరిత్రలో అత్యధిక వసూళ్లు సాధించిన మహిళా ప్రధాన చిత్రంగా మరోసారి తన స్థానాన్ని మరింత బలపరుచుకునే అవకాశం ఉంది.హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాతో ఇంత భారీ స్థాయిలో వసూళ్లు రాబట్టడం సమంత కెరీర్‌లో మరో విశేష విజయంగా నిలుస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రాన్ని దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించగా, కథను రాజ్ నిడిమోరు రూపొందించారు. సమంత స్వయంగా నిర్మించిన ఈ సినిమా ఆమెకు నటిగానే కాకుండా నిర్మాతగానూ విజయాన్ని అందించింది. సినిమాలో గుల్షన్ దేవయ్య, దిగంత్ మంచాలే, గౌతమి, శ్రీముఖి తదితరులు కీలక పాత్రల్లో నటించగా, సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ అందించిన సంగీతం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇక సినిమా విజయంతో పాటు సమంత వ్యక్తిగత జీవితంలోనూ సంతోషకరమైన దశను ఆస్వాదిస్తున్నారు. ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉండటంతో షూటింగ్‌లకు విరామం ఇచ్చి కుటుంబంతో సమయం గడుపుతున్నారు.



# నా కొడుకు గర్వపడే సినిమాలే చేస్తా ..

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా తన సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. దశాబ్దానికి పైగా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో అగ్ర కథానాయికగా రాణించిన ఆమె ప్రస్తుతం వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తల్లి అయిన తర్వాత తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని, ఇప్పుడు సినిమాల ఎంపికలో కొత్త ప్రమాణాలను పాటిస్తున్నానని కాజల్ తాజాగా వెల్లడించారు. ప్రస్తుతం ది ఇండియా స్టోరీ తో పాటు ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'రామాయణ' షూటింగ్‌లతో బిజీగా ఉన్న కాజల్, ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.తల్లి అయిన తర్వాత సినిమాలకు ఓకే చెప్పే విధానం పూర్తిగా మారిపోయిందని కాజల్ తెలిపారు. ఇప్పుడు ఏ కథ విన్నా ముందు ఒక నటిగా కాకుండా తల్లిగా ఆలోచిస్తాను. నా కొడుకు నీల్ పెద్దయ్యాక నా సినిమాలు చూసి, 'ఇది మా అమ్మ చేసిన గొప్ప సినిమా' అని గర్వంగా చెప్పుకునేలా ఉండాలి. అందుకే ఇప్పుడు స్క్రిప్ట్ ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాను అని చెప్పారు. కేవలం కమర్షియల్ అంశాల కోసం కాకుండా, మంచి కథ, బలమైన పాత్ర, సమాజానికి ఉపయోగపడే సందేశం ఉన్న చిత్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందుతున్న ది ఇండియా స్టోరీలో కాజల్ అగర్వాల్ ఓ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో కనిపించనున్నారు. శ్రేయస్ తల్పడే కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం జూలై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.

SANDEEP REDDY VANGA



# ఉవ్వెత్తున ఎగిసే ఉత్తుంగ తరంగం

అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. సోమవారం ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.అణువు అణువును ఉర్రూతలూపే ప్రణయ కల్లోలమే-రోమాంచకం, ఊహకే అందని ఉవ్వెత్తునెగిసే ఉత్తుంగ తరంగమే రోమాంచకం' అంటూ మెలోడియస్ ట్యూన్‌తో ఈ గ్లింప్స్ ఆకట్టుకునేలా ఉంది. వాసుకి వైభవ్ మ్యూజిక్, విజువల్స్ ఈ గ్లింప్స్‌లో ప్రధానాకర్షణగా నిలిచాయి. ప్రేమ, హాస్యం , ఉత్కంఠ కలబోసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ తెలిపారు.